క్లుప్తంగా

రెడ్డెమ్మకొండపై అఖండ దీపం



అఖండ దీప ప్రజ్వలన కార్యక్రమంలో అమ్మవారి వంశస్థులు

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లెలోని రెడ్డెమ్మకొండ ఆలయంలో అఖండ దీప ప్రజ్వలన గురువారం ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి మరుసటి రోజున లింగోద్భవ కాలంలో కొండపై దీప ప్రజ్వలనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. గురువారం అమ్మవారి వంశస్థులు ఆచారం ప్రకారం పూజాసామగ్రిపి గా రెడ్డెమ్మకొండపైకి తీసు కెళ్లారు. పూజలు నిర్వహించి మహాశివుడికి అఖండ దీపం వెలిగించారు. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ మాజీ ఛైర్మెన్ నరసింహా రెడ్డి, మాజీ ఆలయ కమిటీ సభ్యులు మదన్ మోహన్‌రెడ్డి, సేవకులు పాల్గొన్నారు.

మల్లయ్య కొండలో వాస్తు పండితులు



అంగళ్లు మల్లయ్యకొండపై వాస్తు పండితులు హరి ప్రసాద్

కురబలకోట : గృహ వాస్తు ప్రభావంతో మనిషి జీవితం ముడిపడి ఉంటుందని పుంగనూరుకు చెందిన అనుభవ వాస్తు పండితులు పి.హరిప్రసాద్ పేర్కొన్నారు. అంగళ్లు మల్లయ్యకొండను గురువారం ఆయన సందర్శించి స్వామికి అభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ మనిషికి ఎన్ని తెలివి తేటలు, శక్తి సామర్థ్యాలున్నా అనుకూల పరిస్థితులు తోడైతే అనితర విజయాలు సాధిస్తాడన్నారు. ప్రతి మనిషికి స్థాన బలం, తన బలం రెండూ ఉండాలన్నారు. వేదాలలో ఒకటైన వాస్తు వేల సంవత్సరాలుగా ఆచరణలో ఉందన్నారు. వాస్తును నమ్మకపోవడం వారి వ్యక్తిగత విషయమన్నారు.

విద్యార్థి ప్రతిభ

కలికిరి : మండలంలోని చింతమాకులపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థి పి. అన్విత్‌నందన్ రాయచోటిలో గురువారం నిర్వహించిన ద వర్డ్ పవర్ చాంపియన్ షిప్ పోటీలలో ప్రతిభ చూపారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి మార్చిలో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం భారతి తెలిపారు. ఎంఈఓ కరీముల్లా, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

రూ. 20 లక్షలతో ఈద్గా అభివృద్ధి పనులు

పీలేరు రూరల్ : పీలేరు–మదనపల్లె మార్గంలో బోదేషావలి దర్గా వద్ద రూ.20 లక్షలతో ఈద్గా అభివృద్ధి పనులు చేపట్టినట్లు ముతవల్లులు అల్లావుద్దీన్, అమీర్‌బాషా, మహబూబ్‌బాషా, రఫీ, రియాజ్ తెలిపారు. ఈద్గాలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం వారు పరిశీలించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈద్గాలో సీసీ ప్లాట్‌ఫాంతోపాటు ప్రహరీ నిర్మించ నున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లడ్డూ జాఫర్, ఎం.రెడ్డి బాషా, కెజిఎస్.రెడ్డిబాషా, అతికా షఫీ, షౌకత్, మౌలా, మబ్బూషా, రియాజ్, రెడ్డి బాషా, తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో భళా

కలకడ : కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో చిత్తూరు జట్టు నుంచి పాల్గొన్న కోన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సాయినాథ్, మునిగణేష్ రాయల్, జితేంద్ర, షామీర్‌ఖాన్ ప్రతిభ చూపి భళా అనిపించారు. పోటల్లో రాణించి వెండిపతకం సాధించినట్లు హెచ్‌ఎం మోడెం చెంగలరాయుడు తెలిపారు. ఈ సందర్భంగా పీడీ ఝాన్సీరాణి, విద్యార్థులను తోటి ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో మహేశ్వరి, నాగమణి నాయక్, రమేష్‌కుమార్‌రెడ్డి, షౌకత్‌అల్లీ, గఫార్‌ఖాన్, నౌషాద్‌బేగం, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

మదనపల్లె : బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్‌ను పట్టణంలోని విజయభారతి స్కూల్ కరస్పాండెంట్ ఎన్.సేతు, సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. విజయభారతి స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్.ఎస్.సేతు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థి బందెల గౌతమ్‌కుమార్.. బీఎస్పీకి అధ్యక్షుడు కావడం తమకు గర్వ కారణమన్నారు. నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేస్తే విజయం వస్తుందనేందుకు గౌతమ్ నిదర్శనమన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో తల్లిదండ్రుల తర్వాత గురువుకు గొప్పస్థానం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకొని సమాజసేవకు పాటుపడాలన్నారు.

ప్రభుత్వ ఖాజీగా జలాలుద్దీన్

మదనపల్లె సిటీ : మదనపల్లె నియోజకవర్గ ప్రభుత్వ ఖాజీగా పట్టణానికి చెందిన షేక్ మహమ్మద్ జలాలుద్దీన్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఈ హోదాలో ప్రాథమికంగా పది సంవత్సరాలు కొనసాగనున్నారు

• వైభవంగా రథోత్సవం



హోమ గుండం వద్ద గురూజీ పూజలు



ప్రసన్న పార్వతీ సమేత సంఘమేశ్వరుడి రథం లాగుతున్న భక్తులు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లి సమీపంలోని పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన ప్రసన్న పార్వతీ సమేత సంఘమేశ్వరుడి రథోత్సవం గురువారం కన్నుల పండుగగా జరిగింది. మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమానికి చెన్నరాయునిపల్లికి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనాథ్ రెడ్డి తనయుడు పి.మనోజ్ జయంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు డాక్టర్ బాలకృష్ణాగురూజీని సాదరంగా ఆహ్వానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. రథోత్సవం వద్ద గురూజీ హోమాలు, పూజలు నిర్వహించి శివనామ స్మరణతో రథాన్ని లాగారు. భక్తులకు అన్నదాన సౌకర్యం కల్పించారు. వీరితోపాటు రిటైర్డ్ హైకోర్టు జడ్జి జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏవీ.లక్ష్మీదేవమ్మ, బీజేపీ నాయకుడు చల్లపల్లి నరసింహారెడ్డి, డాక్టర్లు పవన్‌కుమార్, విక్రమ్‌లతోపాటు పార్టీలకతీతంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని పూజలందుకున్నారు. పెద్దతిప్పసముద్రంలో ననగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో శివ, పార్వతుల ప్రతిమలను పుర వీధుల్లో ఊరేగించారు. కోలాటం, చెక్క భజన నడుమ గోవింద నామ స్మరణలతో రథోత్సవం సాగింది.

హరినామస్మరణతో మార్మోగిన ఝురికోన



ఝురికి తరలి వస్తున్న భక్తులు



ఝురిలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

- భక్తుల హరినామంతో మారుమ్రోగిన ఝురి
- లక్షలాదిగా భక్తులు పుణ్యస్నానాలు
- వందలాదిగా తరలివచ్చిన ఆలయమాన్యాలు
- భక్తులకు దాతల అన్నదానం
- గట్టి బందోభస్తు, రవాణసౌకర్యంకల్పించిన అధికారులు

కలకడ : భక్తు హరినామస్మరణతో పవిత్ర ఝురి కోన మార్మోగింది. మహా శివరాత్రి మరుసటి రోజున గురువారం సత్యవతి నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తే తమ కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. దీంతో ఉదయం ఐదు గంటల నుంచి చిత్తూరు, కడప, అనంతపురం, జిల్లాలనుంచేగాక, కర్ణాటక, చెన్నై నుంచి భక్తులు హాజరయ్యారు. పవిత్ర ఝురిలో పుణ్య స్నానాలు ఆచరించారు. దేవుని మాన్యాలు, దేవరెద్దులు ఝురిలోకి దిగే సమయంలో కోలాటం, చెక్కభజన, పిల్లనగ్రోవి, మేళ తాళాలతో పలువురు కళాకారులు ఆకట్టుకున్నారు. పలువురు ఎస్ఐలు, సీఐలు భారీ బందోబస్తు నిర్వహించారు. ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఉచిత సేవలందించారు. రామచోటి, పీలేరు, మదనపల్లె, కడప, పులివెందుల ఆర్టీసి డిపో మేనేజర్లు భక్తుల సౌకర్యార్థం, ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. భక్తులకు సేవలందించేందుకు రాజకీయాలకతీతంగా యువకులు ముందుకు వచ్చారు. కామాక్షి సమేత సిద్ధేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

• నేలమల్లేశ్వరుడి జాతర

పెద్ద సంఖ్యలో చాందిని బండ్లు

నిమ్మనపల్లె : మండలంలోని యోగ నేల మల్లేశ్వరస్వామి ఉత్సవాలలో భాగంగా గురువారం తిరుణాల(జాతర) కోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా నేలమల్లేశ్వర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు చాందిని బండ్లు కట్టుకుని, డప్పు, మేళ తాళాలతో ఊరేగింపుగా వచ్చి నేల మల్లేశ్వరస్వామి ఆలయ ప్రదక్షణ చేశారు. సమీపంలోని పలు మండలాల నుంచేగాక, కర్ణాటకభక్తులు పెద్ద ఎత్తున దర్శనానికి పోటెత్తారు. బుధవారం రాత్రి నుంచే భక్తుల తాకిడి పెరిగింది. ఆలయ పరిసరాలు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. ఈఓ మంజుల, ఉత్సవాల ప్రత్యేక అధికారి రవికుమార్, ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యుడు మేషరామకృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు పెద్దఎత్తున ఏర్పాట్లుచేశారు. చిన్నరెడ్డప్ప ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఆలయ పూజారులు శంకరశర్మ, లక్ష్మణ స్వామి, తదితరులు బుధవారం రాత్రి కామేశ్వర కళ్యాణం వైభవంగా జరిపించారు. తిరుణాల ఉత్సవాలకు మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు శంకర శర్మ లక్ష్మణ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను మదనపల్లె డిపో నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు. నిమ్మనపల్లె ఎస్ఐ తిప్పేస్వామి, మదనపల్లి రూరల్ సర్కిల్ ఇన్‌చార్జ్ సీఐ ఎరిషావలి ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డప్ప, రాజన్న, సుధాకర పాల్గొన్నారు.



కళ్యాణోత్సవంలో భాగంగా అమ్మవారి తాళి బొట్టు చూపిస్తున్న పూజారి



తిరణాలకు తరలివచ్చిన జనం

• శివపార్వతుల కల్యాణం

తంబళ్లపల్లె : తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్య కొండపై వెలసిన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. బుధవారం రాత్రి వేదపండితులు కట్టా సంజీవ పవన్ సంప్రదాయబద్ధంగా శివ పార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు తనివి తీరా తిలకించి పరవశించిపోయారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను తేరుపై కొలువుంచి రథోత్సవం జరిపారు. మల్లయ్యదారులు ఆకర్షణీయమైన నల్లటి దుస్తులు ధరించి ఎలుగుబంటు చర్మంతో టోపీ ధరించి ఢమరకం వాయిస్తూ చేసిన నృత్యం అలరించింది. శశికుమార్, మునిరాజ, ఈశ్వరప్ప, మల్లికార్జున పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు వాయిదా

మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు స్వామికి చెల్లించిన శాశ్వత హుండీ లెక్కింపు మార్చి నెల 15వతేదీ నాటికి వాయిదా వేసినట్లు ఆలయ ఇన్స్‌పెక్టర్ శశికుమార్, ఈఓ మునిరాజ తెలిపారు. టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.3,44,820, కల్యాణోత్సవం చదివింపులు రూ.30 వేలు, చందాల ద్వారా రూ.44,129, తాత్కాలిక హుండీ ద్వారా రూ.89,969 ఆదాయం వచ్చిందన్నారు. కొందరు కూటమి నాయకులు తమకు తెలియకుండా లెక్కింపు చేయడంతో వాయిదా వేసినట్లు ఈవో తెలిపారు.



రథంపై ప్రత్యేక అలంకరణలో శివపార్వతులు

కాశీవిశ్వేశ్వరస్వామి ఊరేగింపు



పీలేరు : త్రిశూల స్నాన ఘట్టం నిర్వహిస్తున్న పండితులు

పీలేరు : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాశీవిశ్వేశ్వరస్వామి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి జాగారం చేసిన భక్తులు ఉదయం స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు విరూపాక్షం కుమారస్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. గురువారం ఉదయం కాశీవిశ్వేశ్వరసామి ఆలయం నుంచి శివపార్వతులను పట్టణంలో అంగరంగ వైభవంగా ఊరేగించారు. పీలేరు శివారు ప్రాంతం శ్రీచెన్నకేశవ స్వామి ఆలయ సమీపంలో త్రిశూల స్నానం నిర్వహించారు. మండలంలోని శివరామపురంలో వెలసిన భ్రమరాంబికా, మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

పుండీశ్వరస్వామి కల్యాణోత్సవం



మానేవారిపల్లెలో మల్లికార్జునస్వామి

రామసముద్రం : మండలంలోని మూగవాడిలో వెలసిన పుండీశ్వరస్వామి కల్యాణోత్సవం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. రామసముద్రంలోని వాలీశ్వరస్వామి, చంద్రశేఖర స్వామి, మానేవారిపల్లె మల్లికార్జునస్వామి ఆలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. బల్లసముద్రం కొండపై పలువురు దాతలు భక్తులకు అన్నదానం చేపట్టారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఝురి ఉత్సవం



పూలకొండలో మల్లికార్జున స్వామి

కలికిరి : మండలంలో గురువారం వైభవంగా ఝురి ఉత్సవం నిర్వహించారు. గుట్టపాళెం గ్రామం పూలకొండ వద్ద వెలసిన భ్రమరాంబిక, మల్లికార్జున స్వామికి తలనీలాలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణంలో స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. మేడికుర్తి అగస్త్యేశ్వరాలయంలో ఘనంగా ఝురి ఉత్సవం నిర్వహించారు. గంగిరెద్దుకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు బాహుదా నదిలో స్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. కలికిరిలోని సోమేశ్వరాలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు.

పులకించిన జనం



గుండాలమల్లేశ్వరస్వామి ఆలయంలో ఝురీ వద్ద భక్తుల సందడి

పీలేరురూరల్ : మండలంలోని మద్గుండాల మల్లేశ్వర స్వామి ఆలయంలో ఝురి ఉత్సవం గురువారం వైభవంగా జరిగింది. బుధవారం రాత్రంతా శివనామ స్మరణతో జాగారం చేసిన భక్తులు గురువారం ఉదయం ఝురి స్నానంతో స్వామిని దర్శించుకున్నారు. దేవరెద్దులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పలువురు అన్నదానం చేశారు. భక్తుల కాలక్షేపానికి ద్రౌపది మాన సంరక్షణ నాటకం ఏర్పాటు చేశారు.

వైభవంగా గిరిజా కల్యాణం

మదనపల్లె సిటీ : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక దేవళం వీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో గిరిజా కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. ఆలయ ఆవరణంలో స్వామి, అమ్మవార్లను కొలువుంచి ప్రధాన అర్చకులు ఫణికుమార్ శర్మ, బాలాజీ, అమర ఆధ్వర్యంలో కళ్యాణ తంతు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సుగుణా ఆంజనేయులు అన్న ప్రసాద వితరణ చేశారు. పెంచుపాడు పంచాయతీ రెక్కమానులో గౌరీ ధన లింగేశ్వరస్వామి ఆలయంలో జరిగిన ఉత్సవాల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ పాల్గొనగా, సర్పంచ్ సాలమ్మ తదితరులు ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మహేష్‌బాబు, మల్లికార్జునరెడ్డి, పంచరత్న బాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక బెంగుళూరురోడ్డులోని యోగభోగేశ్వరస్వామి ఆలయంలో ఉట్ల తిరుణాల నిర్వహించారు.



పూజలు చేస్తున్న నిస్సార్‌అహ్మద్

ఆంధకారంలో..లక్ష్మీనరసింహుడి ఆలయం



తరిగొండలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయం



ఆలయంలో మరమ్మతులకు నోచని జనరేటర్

- ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచని జనరేటర్
- కరెంటు పోతే ఆలయంలో అంధకారమే!
- బ్రహ్మోత్సవాలకైనా వినియోగంలోకి వచ్చేనా?

గుర్రంకొండ : మండలంలోని తరిగొండలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో కరెంటు పోతే అంధకారం అలుముకుంటోంది. ఆలయం వద్ద జనరేటర్ మరమ్మతులకు గురై ఏళ్లు గడుస్తున్నా టీటీడీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. జనరేటర్ బాగుచేయకపోవడంతో విద్యుత్తు సరఫరా లేని సమయంలో భక్తులు ఇబ్బందిపడుతున్నారు. ఆలయ ప్రాంగణంలోనే వేంకటేశ్వరస్వామి భక్తురాలు తరిగొండ వెంగమాంబ ఆలయం ఉంది. 17ఏళ్ల కిందట ఈ ఆలయాన్ని టీటీడీ వారు దత్తత తీసుకున్నారు. అనంతరం ఆలయానికి అవసరమైన కొత్త జనరేటర్ ఏర్పాటుచేశారు. నాలుగేళ్ల కిందట ఆ జనరేటర్ మరమ్మతులకు గురికావడంతో టీటీడీ అధికారులు బాగుచేయలేదు. విద్యుత్తు సరఫరా లేని సమయంలో భక్తులు అంధకారంలో మగ్గుతున్నారు. మార్చిలో స్వామివారి బ్రహ్మోత్సవాలు 11 రోజులపాటు నిర్వహించనున్నారు. ప్రతి రోజూ ఓ వాహనంపై గ్రామ పురవీధుల గుండా ఊరేగనున్నాడు. వందలాది భక్తులు ఆలయానికి తరలివస్తుంటారు. ఆలయంలో పలు అభిషేకాలు, అర్చనలు నిర్వహించే సమయంలో కరెంటు కట్ అయినప్పుడు ఇబ్బంది పడాల్సి వస్తుంది. బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యే లోగా జనరేటర్ వినియోగంలోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు. ఈ విషయమై టీటీడీ ఇన్స్‌పెక్టర్ కృష్ణమూర్తి వివరణ కోరగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయాలి

మదనపల్లె : దేవతానగర్‌లో అక్రమ నిర్మాణాలు తొలగించేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారులపై దాడి చేసిన భూకబ్జాదారుడిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని సీపీఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణప్ప, మురళీ, రెడ్డిసాహెబ్ డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ... అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న రెవెన్యూ అధికారుల పైన భౌతిక దాడికి దిగి జేసీబీ అద్దాలు పగలగొట్టి, పెట్రోల్ పోసి అగ్గిపెట్టే స్థాయికి కబ్జాదారులు తెగించారంటే పరిస్థితి చేయిదాటిందని అర్థమవతోందన్నారు. కొంతమంది అధికారుల వల్లా భూకబ్జాదారులు పెట్రేగిపోతున్నారని విమర్శించారు. కలెక్టర్ స్పందించి భూఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు.

మదనపల్లె : రెవెన్యూ అధికారులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయం ఏఓ రాఘవేంద్రను గురువారం ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బసినికొండ పంచాయితీలో కబ్జా భూమిలో అక్రమ నిర్మాణాలు తొలగించేందుకు వెళ్లిన ఆర్ఐ శేషాద్రిరావు, వీఆర్ఓ ప్రసాద్‌లపై స్థానికుడు చలపతి, అతడి అనుచరులు విచక్షణా రహితంగా దాడిచేయడం తగదన్నారు.ఈ ఘటనలు పునరావృతం కాకుండా, దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు హరిశర్మ, నరసింహ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులను గుర్తించాలి

మదనపల్లె : గ్రామ స్థాయిలో వ్యాధులను గుర్తించి మెరుగైన సేవలందించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రమష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక త్యాగరాజ వీధిలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో వైద్యులు, సిబ్బందికి గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్కౌట్స్ యూనిట్ ప్రారంభం

గుర్రంకొండ : గుర్రంకొండ తెలుగు జెడ్పీ హైస్కూల్‌లో నూతన స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ఎంఈవో సుబ్రహ్మణ్యం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సేవా దృక్పథంతో మెలగడానికి ఉత్తమమైన మార్గం స్కౌట్ అండ్ గైడ్స్ మాత్రమే అన్నారు. ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ మదన్‌మోహన్, పీడీ రమేష్‌బాబు, రవినాయక్, తులసి, హర్షవర్థన్ పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడిగా అష్రఫ్

మదనపల్లె : అఖిల భారతీయ గోరక్ష మహా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడిగా వేంపల్లె అష్రఫ్‌ను నియమిస్తూ జాతీయ కార్యదర్శి అయూబ్‌ఖాన్ ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో అష్రఫ్ అలీకి నియామకపత్రాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా అష్రఫ్ అలీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో గోవుల అక్రమ తరలింపును అడ్డుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగరాజ, అమరేంద్ర, బుజ్జి, కృష్ణప్ప, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

మదనపల్లె సిటీ : ఇంజినీరింగ్ విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. కాలేజీలో బీటెక్ విద్యార్థులకు ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్, టెలి కమ్యూనికేషన్ అంశాలపై గురువారం సెమినార్ నిర్వహించారు. రామలింగారెడ్డి మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్లను ఆటోమేటివ్ ఎలక్ట్రానిక్ పరికరాలలో ఉపయోగిస్తారని, వాటితో ఎలక్ట్రానిక్ వస్తువుల పరిమాణం తగ్గి పనితనాన్ని పెంచుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సతీష్‌బాబు, ఈసీఈ విభాగాధిపతి కె.వరప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని అటవీశాఖ అధికారి మృతి

గుర్రంకొండ: ద్విచక్ర వాహనం ఢీకొని అటవీశాఖఅధికారి మృతి చెందిన సంఘటన మండలంలోని శ్రీనివాసపురం వద్ద జరిగింది. పెద్దమండ్యం మండలం కలిచెర్ల గ్రామానికి చెందిన కందుకూరు శేఖరగౌడ్(61) గుర్రంకొండ మండలం తరిగొండలో అసిస్టెంట్ బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి తరిగొండలో విధులు ముగించుకొని స్వగ్రామమైన కలిచెర్లకు ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. పట్టణం లోని కొత్తపేటవీధికి చెందిన ఫిరోజ్‌ఖాన్(33) వాల్మీకిపురానికి ద్విచక్రవాహనంలో బయలు దేరాడు. మార్గ మధ్యంలో ఎగువ అమిలేపల్లె–శ్రీనివాసపురం గ్రామాల మధ్య రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శేఖర్ గౌడ్‌కు తీవ్రగాయాలయ్యాయి. ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. గాయాలపాలైన ఫిరోజ్‌ఖాన్‌ను వైద్యసేవల నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు.



మృతి చెందిన అటవీశాఖఅధికారి శేఖర్‌గౌడ్

న్యాయం చేయకుంటే ఆత్మహత్యలే శరణ్యం

పెద్దతిప్పసముద్రం : రెవెన్యూ అధికారులు న్యాయం చేయకుంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమని మండలంలోని పట్టెంవాండ్లపల్లి పంచాయతీకి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరులతో ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 1 సర్వే నంబర్‌లో మఠం భూమి మొత్తం 747 ఎకరాలుండగా, 20 ఎకరాల భూమి పది మంది రైతుల అధీనంలో ఉందన్నారు. కొనుగోలు చేసిన సదరు భూములను సాగు చేశామని, పట్టాదారు పాసు పుస్తకాలు తీసుకుని బ్యాంకులో రుణాలు కూడా పొందామన్నారు. అయితే 2017 నుంచి తమకు వన్‌బీ, అండంగల్ రావడం లేదని, అధికారులు పొంతన లేని సమాధానాలు చెబుతూ కాలయాపన చేస్తున్నారని అసహనం వ్యక్తం చేసారు. 2022లో తామంతా లోకాయుక్త కార్యాలయంలో గోడు వెళ్లబోసుకున్నామన్నారు. మా రికార్డులు పరిశీలించిన లోకాయుక్తా సమస్య పరిష్కారం అయ్యే వరకు బాధిత రైతులకు అన్ని సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఉత్తర్వులు పంపిందన్నారు. ఈ విషయంపై తహశీల్దారు శ్రీరాములునాయక్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతంలోనే హోల్డ్‌లో పెట్టేశారని తెలిపారు. రైతుల వద్ద ఏం రికార్డులు, లోకాయుక్త సిఫారసు చేసిన ఉత్తర్వులు అందజేస్తే కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు.



తాము నష్టపోయామంటున్న రైతులు

వక్ఫ్ సవరణ బిల్లుతో మైనార్టీలకు ప్రమాదం

మదనపల్లె: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొస్తున్న వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లిం మైనార్టీల మనుగడకు ప్రమాదంఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు దాదా గాంధీ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన వక్ఫ్ సవరణ బిల్లు వ్యతిరేక సభలో ఆయనతోపాటు సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు. దాదాగాంధీ మాట్లాడుతూ బిల్లుకు వ్యతిరేకంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను నియమించి ముస్లింల మనోభావాలను దెబ్బతీస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అల్లాబకష్, ఎస్ఎండీ.గౌస్, ఎస్‌కే.బాషా, సయ్యద్‌వలి, ఖాదర్ బాషా, ముబారక్‌ఖాన్ కృష్ణప్ప, మురళి, సాంబశివ, శ్రీనివాసులు, హరినాథ్ శర్మ పాల్గొన్నారు.